


ఎం.తేజవతి

# నవవసంతం వైపుగా...

**బ్యాం**కులో పెరిగిపోతున్న మొండి బకాయిలపై జరిగిన సెమినార్‌లో పాల్గొని బయటకు వచ్చిన నాకు తలంతా వేడెక్కిపోయింది. ప్రతి శాఖలో ఉన్న మొండి బకాయిలను రెండు శాతం లోపుగా ఉండేటట్లు చేయాలని చెప్పడం సెమినార్ యొక్క ప్రధాన ఉద్దేశం. నేను బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న విశాఖపట్టణం పోర్టు శాఖలో ప్రస్తుతం ఉన్న మొండి బకాయిల మొత్తం ఐదు కోట్లు. ఉన్న మొత్తం రుణాలు ఏభై కోట్లు. అంటే ప్రస్తుతం ఉన్న పది శాతం మొండి బకాయిలను రెండు శాతం లోపుకి తేవాలంటే నాలుగు కోట్ల మొండి బకాయిల్ని వసూలు చేయాలి. ఈ అంకెలన్నీ మనసులో అనుకుంటేనే ముచ్చెమటలు పోశాయి. సెమినార్‌లో నిర్దేశించిన లక్ష్యం కష్టసాధ్యంగా కూడా అనిపించలేదు. అసాధ్యంగా తోచింది.

సెల్‌ఫోన్ మోగడంతో పౌచ్‌లోంచి తీసి చూస్తే "స్వీట్ హార్ట్ కాలింగ్" అని కనిపించింది. అసహనంగానే లిఫ్ట్ చేశాను. దసరా సందర్భంగా వచ్చేవారంలో వరుసగా మూడురోజులు సెలవులు కావడంతో వైజాగ్ వస్తున్నానని చెప్పింది హైదరాబాద్‌లో ఉంటున్న నా శ్రీమతి.

"ఇంకేమైనా సంగతులున్నాయా" అని అడిగాను ఇంకేమీ ఉండవని తెలిసి కూడా.

"ఇంకేముంటాయి. ఆఫీసులో పనితో ఊపిరి తీసుకోవడానికి కూడా టైముండటం లేదంటూ" ముక్తాయించింది శ్రీమతి.

నా శ్రీమతి పేరు సుధారాణి. మాకు పెళ్లయ్యి నాలుగేళ్లయ్యింది. పెళ్లయిన మొదట్లో స్వీట్‌హార్ట్ అని పిలిచేవాణ్ని. ఇప్పుడు రోజుకోసారి ఫోన్ చేయడానికి కూడా ఆసక్తి కలగడం లేదు. అలాగని ఇద్దరిమధ్యా తరచూ గొడవలు జరుగుతాయని కాదు, అపోహలు ఉన్నాయని కాదు, అభిప్రాయభేదాలు ఉన్నాయని కాదు... జస్ట్ అంతే. ఎందుకో ఒకరంటే ఒకరికి ప్రేమ కలుగని ఒక నిర్లిప్తమైన, నిరామయమైన ప్రవాహంలో కొట్టుకుపోతున్నాం. నేను ఇక్కడ విశాఖపట్టణంలో ప్రభుత్వరంగ బ్యాంకులో పనిచేస్తోంటే, తను హైదరాబాద్‌లో ప్రైవేటురంగ బ్యాంకులో పనిచేస్తోంది. నాది ఉదయం పది గంటలకి బ్యాంక్‌కి వెళ్తే రాత్రి ఎనిమిదింటికి గానీ ఇంటికి రాని ఉద్యోగమైతే, తనది ఉదయం తొమ్మిదింటికి వెళ్లి రాత్రి ఎనిమిది దాకా ఉద్యోగం చేసినా ఇంటికొచ్చిన తరువాత కూడా సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పంపడం ద్వారానో, కంప్యూటర్‌లో ఇ-మెయిల్స్ పంపడం ద్వారానో పడుకునేంత వరకు ఉద్యోగం చేస్తూనే ఉంటుంది. వేన్నీళ్లకు చన్నీళ్లు తోడవుతాయన్న సగటు మధ్యతరగతి మానవుడి ఆలోచనతో ఉద్యోగస్తురాలిని పెళ్లి చేసుకున్నానన్న మాటేగానీ పెళ్లయిన ఒక్క సంవత్సరమే హైదరాబాద్‌లో కలిసి ఉన్నాం. తరువాత నేను వైజాగ్‌కి ప్రమోషన్ మీద బదిలీ అయ్యాను. ఆరోజు నుండి ఇద్దరం గెస్టుల్లాగా పండగలనాడో, వీకెండ్స్‌లోనో, సెలవు దొరికినపుడో కలుసుకోవడం జరుగుతోంది. హైదరాబాద్‌లో నలభై లక్షల రుణం పెట్టి కొన్న ఇంటికి తన జీతం నుండి కడితే, ఏడు లక్షల లోను పెట్టి కొన్న కారుకి, క్రెడిట్ కార్డులకి నా జీతం నుండి జమచేస్తుంటాను.

సెమినార్‌లో నిర్దేశించిన లక్ష్యం ఎంత జటిలమైందో, మా సంసార బంధాన్ని సజావుగా నడిపించడమూ అంతే జటిలంగా తోచింది. బ్యాంకులో మొండి బకాయిల్లాగే మా సంసారం కూడా సంతోషాన్ని తిరిగి ఇవ్వని మొండి బకాయిలాగా మారిపోయిందనిపించింది.

* * *

మొండి బకాయిలన్నీ పరిశీలిస్తే అర్థమైంది. అందులో సంఖ్యాపరంగా చూస్తే ఎక్కువగా ఉన్నవి గవర్నమెంట్ స్పాన్సర్డ్ స్కీముల్లో ఇచ్చినవే. కానీ విలువ ప్రకారం చూస్తే బ్యాంక్ రెగ్యులర్ స్కీముల్లో ఇచ్చిన ఖాతాల వలనే మొండి బకాయిల మొత్తం విలువ పెరిగింది. నిజమే మరి. గవర్నమెంట్ స్పాన్సర్డ్ స్కీముల్లో ఇచ్చిన ఋణం ఏదీ సాధారణంగా లక్ష రూపాయలు దాటి ఉండదు. మొండి బకాయిల్లో ఉన్న గవర్నమెంట్ స్పాన్సర్డ్ స్కీముల ఖాతాలను ఒక లిస్టుగా, బ్యాంక్ రెగ్యులర్ స్కీముల్లో ఉన్న ఖాతాలను ఒక లిస్టుగా తయారుచేసుకున్నారు.

సాధారణంగా బ్యాంక్ రెగ్యులర్ స్కీముల్లో ఋణాలు ఇచ్చినవారికి ఫోన్ నెంబర్లు ఉంటాయి. వారందరినీ ఫోన్ల ద్వారా కాంటాక్ట్ చేశాను. ఇక కాంటాక్ట్ చేయాల్సింది గవర్నమెంట్ స్పాన్సర్డ్ స్కీముల్లో ఉన్న మొండి బకాయిదారుల్నే. సాధారణంగా వీళ్లంతా ఉండేది దిగువ మధ్యతరగతివారు ఉండే ప్రాంతాల్లోను మరియు మురికివాడల్లోనే. కనీసం మూడు రోజులైనా పడుతుందనిపించింది. అందర్నీ కలవాలంటే ఇంతకుముందు ఇక్కడే వైజాగ్‌లో ఫారన్ ఎక్స్ఛేంజ్ శాఖలో చేసేవాడిని. అక్కడకి వచ్చేవాళ్లంతా డబ్బున్న మారాజులే. డబ్బుకి కొరతుండదు. సమస్య ఉండదు. ఎంత వైట్‌లో చూపించాలి, ఎంత బ్లాక్‌లో చూపించాలి అన్నదే సమస్య. విశాఖపట్టణం పోర్టు శాఖకి వచ్చిన తరువాతే అన్నిరకాల కస్టమర్లను కలవడం జరిగింది. ఏ రోజుకి ఆ రోజు కష్టపడితే కానీ తిండి తినలేని పోర్టు కూలీలతోను, నాలాంటి మధ్యతరగతి పోర్టు ఉద్యోగులతోను, విదేశీ కార్లలో తిరిగే పోర్టు కాంట్రాక్టర్లతోను ఉద్యోగరీత్యా వ్యాపార లావాదేవీలు నిర్వహించాల్సిన బాధ్యత నాది.


* * *

మురికివాడల్లో తిరగడం మొదటిసారి కావడం వల్లనేమో అక్కడి వాతావరణం కొత్తగా అనిపించడమే కాదు భారతదేశంలో ఎక్కువమంది ప్రజలు ఎదుర్కొనే స్థితిగతులూ అర్థమవ్వసాగాయి. విశాఖలో ఉన్న కొండల్ని, గుట్టల్ని, కాలువల పక్కన, రైల్వే ట్రాకల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాల్ని ఆక్రమించుకుని కట్టుకున్న శాశ్వత నిర్మాణాలు అవి. తరువాత ఆ ఆక్రమణలని కార్పొరేషన్‌వారు క్రమబద్ధీకరించడం


వేరే విషయం. ఇల్లంటే ఒక్కటే గది, ఒక్క మనిషి మాత్రమే నిలబడగలిగే వంట గదితో, పక్కనే ఎటాచ్డ్ టాయిలెట్స్‌తో... నాలుగొందల చదరపు అడుగుల్లో నిర్మించిన ఇళ్లవి. మురికివాడల్లో ఎక్కడా స్తబ్ధత లేదు. అందరూ ఏదో ఒక పనిచేసుకుంటూ, చిన్నపిల్లల అరుపులు కేకల్తో వాతావరణం అలజడిగానే ఉంది.

మొండి బకాయిదారులు చాలామంది దొరికారు. ప్రభుత్వం తమ రుణాలు మాఫీ చేసిందనుకుని కట్టడం లేదని కొందరు, వ్యాపారంలో నష్టాలు వచ్చాయని కొందరు, ప్రభుత్వం తమకు ఉచితంగానే రుణం ఇచ్చిందన్న భ్రమతో మరికొందరు... ఇలా ఎవరికి వారే సొంతంగా ఊహించుకుంటూ బకాయిలు తీర్చకుండా ఉండిపోతే, తాగి తందనాలు ఆడి డబ్బుల్ని వృధాచేసి కొందరు, లేబర్‌గా మద్రాసు ఢిల్లీ లాంటి మహా నగరాలకి తరలిపోయి మరికొందరు మొండి బకాయిదారులుగా మారిపోయారు. ఇంతకుముందు రుణం తీసుకుని రద్దయిపోయిన వాళ్లు, కొత్తగా రుణం తీసుకున్నవాళ్లకి "రూపాయి కట్టక్కర్లేదు. బ్యాంకోళ్లకి కనపడకుండా రెండేళ్లు తిరిగితే మన అప్పులన్నీ వాళ్లే మొండి బకాయిలని తీర్మానించి రద్దు చేసేస్తారు" అన్న సలహాలను అనుసరించే వాళ్లూ కొంతమంది ఉన్నారు. కొంతమంది నిజాయితీగా ఉన్న బకాయి మొత్తాన్ని అక్కడికక్కడే కట్టి రశీదు తీసుకున్నారు.





ఎవరు కడతారు, ఎవరు కట్టలేదు, ఎవరు కట్టరు అన్న నిర్ణయం తీసుకోవడం సులువైంది మూడురోజుల కష్టంతో. అయితే లగేజ్ ఆటో కోసం లక్షన్నర రుణం తీసుకున్న అప్పన్న అనే వ్యక్తి ఆచూకీ కనుక్కోవడం కుదరలేదు. నాలుగో రోజు సాయంత్రం అదే పనిగా పెట్టుకుని బయల్దేరాను. మొదటి సంవత్సరం అంతా ఠంచనుగా వాయిదాలు కట్టి, రెండో సంవత్సరం నుండి వాయిదాలు కట్టడం మానేశాడు. లోను తీసుకున్న సమయంలో ఇచ్చిన చిరునామాలో లేడు. ఆ ఇంటిని అమ్మేసి వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడని ఇరుగుపొరుగు ఇచ్చిన సమాచారం. మురికివాడల్లో ఉన్న ఇళ్లను కూడా అమ్ముకుంటారని, వాటిని కొనే వారు ఉంటారని జీవితంలో మొదటిసారిగా తెలుసుకున్నాను. నాలుగొందల చదరపు అడుగుల్లో ఉన్న ఇంటిని రెండు లక్షలకు అమ్మేశాడని చెప్పారు పొరుగున ఉంటున్న అమ్మలక్కలు. ఇల్లే అమ్మేశాడంటే లగేజ్ ఆటో కూడా అమ్మేశాడనిపించి, అదే అనుమానం వారి ముందు పెట్టాను.



"ఆటో అమ్మలేదు బాబూ, అడు నీతున్నోడు. బ్యాంక్ అప్పు దాని మీద ఉంది కాబట్టి అమ్మనని అనేవాడు" అన్నారు అమ్మలక్కలు.

"అంత నీతున్నోడు అంటున్నారు. మరెందుకు బ్యాంక్ అప్పు కట్టడం లేదని" అడిగాను.

"బాబూ వాడి భార్య రెండు కిడ్నీలు పోనాయి బాబూ. భార్యని కాపాడుకోవడానికి రేయింబవళ్లు కష్టపడేవాడు. నెలరోజుల పాటు దయాలసిస్సుని చేయించాడు. రోజుకి ఐదారువేలు నీళ్లలాగా ఖర్చయ్యేవి. ఎలాగైన భార్యని బ్రతికించుకోవాలని అడు మొక్కని దేవుడు లేడు బాబూ. డాక్టర్లు ఇక బ్రతకదని చెప్పినా కూడా ఆశ వదలకుండా అన్ని ప్రయత్నాలు చేశాడు. ఆఖరికి తన కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. అది సరిపోదని డాక్టర్లు చెప్పడంతో మూడు రోజులు నిద్రాహారాలు మాని తన భార్యకు కిడ్నీ కావాలని,

రెండు లక్షలు ఇస్తానంటూ బంధుమిత్రులందరి దగ్గరకి తిరిగాడు. ఎవరూ ధైర్యంగా ముందుకి రాలేదు. భార్య చనిపోయిన రోజున అప్పన్న బాధ వర్ణనాతీతం బాబు, రోజంతా పొగిలి పొగిలి ఏడ్చాడు. ఉన్న ముగ్గురు పిల్లల కోసమైనా గుండె దిటవు చేసుకోవాలని ఎంత చెప్పినా ఏడుపు ఆపలేదు. ఆడికి మొదట బాబు పుట్టాడు. రెండోసారి బాబే పుట్టాడు. తన భార్యలాగా పోలి ఉండే పాప కావాలని ఎంతమంది చెబుతున్నా వినకుండా మూడోసారి పాపని కన్నాడు. అంతా ఆడి ఖర్మ బాబూ, దేవుడు వాడికి అన్యాయం చేశాడు బాబూ" అంటూ అమ్మలక్కలు కంటనీరు తుడుచుకున్నారు.

వాళ్లు చెప్పిందంతా విన్న తరువాత అంత ఉన్నతంగా ప్రేమించే మనసు అప్పన్నకి ఎలా వచ్చిందో అర్థం కాలేదు. పెద్దగా చదువుకోలేదు. ఇరుకు ఇంట్లో భార్య, ముగ్గురు పిల్లలతో కాపురం చేస్తూ, ఇంటి ముందు మురికి కాలువతో, ఏ వసతీ లేని ప్రాంతంలో ఉంటూ మంచినీటి కోసం రేషన్ కోసం నిత్యం పోటీ పడే అప్పన్నకి అంత గొప్ప మనసు ఎలా వచ్చిందని ఎంత ఆలోచించినా అర్థం కాలేదు నాకు.

ఎలాగైనా అప్పన్నని కలుసుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. అప్పన్న కొత్త చిరునామా తీసుకుని అక్కడ నుండి బయల్దేరాను. ఫ్లాట్‌కి వెళ్లానన్న మాటే గానీ అప్పన్నకి భార్య పట్ల ఉన్న అనితరసాధ్యమైన ప్రేమ గురించే ఆలోచిస్తున్నాను. అతనికి బ్రతకడానికి ఉన్న ఒకే ఒక్క ఆధారం లగేజ్ ఆటో. దానిమీద ఎంత ఎక్కువగా అనుకున్నా పదివేలకి మించి రాదు. డీజిల్ ఖర్చు, ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, పోలీసులకి ఇచ్చే మామూళ్లు, బ్యాంక్‌కి కట్టాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్లు అన్నీ కలిపితే మిగిలేది మూడువేలు మించి ఆదాయం ఉండదు.

అప్పన్నలా తాను తన భార్యను ఎందుకు ప్రేమించలేకపోతున్నానో, అప్పన్న భార్యలా తన భార్య తనను ఎందుకు ప్రేమించలేదో అర్థం కాలేదు. తమకి చదువు ఉంది, తెలివితేటలు ఉన్నాయి, సంపాదన ఉంది, ఎప్పుడైనా మాట్లాడుకోవడానికి ఖరీదైన సెల్‌ఫోన్లున్నాయి. అయినా ఇద్దరిమధ్యా ప్రేమగా ఒక్కమాట ఉండదు. ఒకరంటే మరొకరికి కన్సర్న్ ఉండదు. ఉద్యోగం తప్ప మరో లోకం లేనట్లుగా గడిపేస్తున్నారు జీవితాన్ని. తీసుకున్న అప్పులు తీర్చడంలో ఉన్న అవగాహన, జీవితాన్ని కలిసి పంచుకోవడంలోనూ, ఒకరి మనసుని మరొకరు అర్థం చేసుకోవడంలోను, పెరిగిపోతున్న దూరాల్ని దగ్గర చేయడానికి ప్రయత్నించడంలోను లోపించిందనిపించింది.

ఆఫీసులో పని ఒత్తిడి వలనో, యాంత్రికమైపోయిన జీవన విధానం వలనో, డబ్బు సరిపడినంత సంపాదించుకుంటే అదే అన్ని సమస్యల నుండి గట్టెక్కిస్తుందన్న భావన మనసులో ఏ మూలనో కొలువై ఉండటం వలనో కానీ మా ఇద్దరిమధ్య భార్యాభర్తల అనురాగం ఒక్కరోజు కూడా జనించలేదు. షేర్స్‌లోనో, మ్యూచువల్ ఫండ్స్‌లోనో పెట్టిన పెట్టుబడులు లాభాలు ఆర్జిస్తే సంతోషపడ్డమే కానీ, వెన్నెలనో సముద్రాన్నో పచ్చిక మైదానాలనో కలిసి చూసి ఆనందపడ్డ క్షణం ఒక్కటి కూడా మా మధ్య లేదు. ఇద్దరం ఉద్యోగం చేస్తున్నా, ఇద్దరికీ కలిపి జీతం ఎనభై వేలకి పైగానే వస్తున్నా, పిల్లలు వస్తే ఖర్చులు పెరుగుతాయని, ఉద్యోగం పైనా కెరీర్ పైనా ఏకాగ్రత చూపించలేమని పిల్లల గురించి ఆలోచనే చేయలేదు. అలాంటిది అప్పన్న తన భార్యని పోలి ఉండే కూతురు కోసం మూడో ఇష్యూకి కూడా వెళ్లాడు.

నేను ఇప్పుడు ఉన్న పరిస్థితి నుండి ఇలాగైనా బయటపడాలనిపించింది. అప్పన్నని ఇప్పటిదాకా చూడలేదు కానీ, బలమైన ముద్ర నాపై వేశాడనిపించింది. అతడిని ఎలాగైనా కలుసుకోవాలని, బ్యాంకర్‌గానే కాక సాటిమనిషిగా ఏదైనా సహాయం చేయగలనేమో వీలైనంత త్వరగా కనుక్కోవాలనిపించింది.

* * *

అప్పన్న ప్రేమలో ఉన్న నిజాయితీ నాలో ఉత్తేజాన్ని నింపి, జడత్వాన్ని తరిమేసింది. అవసరమున్నా లేకపోయినా నా శ్రీమతికి, తల్లిదండ్రులకు రోజూ రెండుసార్లు ఫోన్ చేసే అదనపు సమయాన్ని, ఓర్పుని, ఆసక్తిని అప్పన్నే కలిగించాడన్నది నిష్ఠుర సత్యం.



# ప్రియమణి ఆనందం

బికినీ ధరించి అందాలు ఆరేసిన ప్రియమణికి మళ్లీ నటనను ప్రదర్శించే పాత్ర లభించిందిట. గతంలో ఓ ఆఫ్‌బీట్ సినిమా ద్వారా ప్రియమణికి మంచి పేరు సంపాదించిపెట్టిన దర్శకుడు బాలూమహేంద్ర మళ్లీ ఓ సినిమాలో ప్రియమణిని తీసుకున్నాట్ట. బాలూమహేంద్ర నుంచి పిలుపు రాగానే ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిందిట ప్రియమణి. ఓ వైపు గ్లామరస్ స్టార్‌గా నటిస్తూనే మరో వైపు అవార్డులు సంపాదించిపెట్టే పాత్రల్ని వేయడానికి ఉత్సాహం చూపిస్తోంది ప్రియమణి. ఈ సినిమాలో ఓ కొత్త నటుడు హీరోగా నటిస్తున్నాడట.

మూడురోజుల తరువాత అప్పన్న కొత్త చిరునామాకి బయల్దేరాను. అప్పన్న ఉండే పాత ప్రాంతం కన్నా ఇది మరింత దారుణంగా ఉంది. ఈగలతో, దుర్వాసనతో, చెత్తా చెదారంతో మనుషులుండే ప్రాంతంలా లేదది. అతికష్టం మీద ఇల్లు పట్టుకోగలిగాను. ఇంటి దగ్గర లేడని ఓ పెద్దావిడ చెప్పింది.

నా వివరాలు చెప్పి "మీరెవరమ్మా" అని అడిగాను.

"నేను అప్పన్న పిన్నిని బాబూ, వీధి చివరన లగేజ్ ఆటోలో లోడింగ్ చేస్తున్నాడు, నేను మిమ్మల్ని తీసుకెళ్తాను" అని బయల్దేరింది.

"పిల్లలూ బయటికెళ్లొద్దు" బయల్దేరుతూ ముగ్గురు పిల్లలకు చెప్పింది.

సందుగొందులన్నీ తిప్పి కిలోమీటరు అవతల ఓ గోడౌన్ దగ్గరకి తీసుకెళ్లింది ఆ వృద్ధురాలు.

"అదిగో బాబూ ఆటోలోకి బస్తాలు మోస్తున్నోడే అప్పన్న. పిల్లలకి తోడెవరూ లేరు, ఉంటాను" అని వెళ్లిపోయింది.

నేనే వెళ్లి అప్పన్నను పరిచయం చేసుకున్నాను. అప్పన్న గోడౌన్‌లోకి వెళ్లి ఓ కుర్చీ తెచ్చి, దుమ్ము దులిపి కూర్చోమని చెప్పాడు.

అప్పన్న అయిదడుగుల రెండంగుళాల పొడవు ఉంటాడు. నల్లటి రంగు, బట్టతలతో సగటు మనిషి కన్నా దిగదుడుపుగా ఉన్నాడు.

"బాబూ, మీ బ్యాంకువారు ఇచ్చిన ఆటో ఇదే. దీనితోనే మా కుటుంబం నడుస్తోంది. నా భార్యకి మాయరోగం రాకపోతే ఈపాటికి సగం పైగా అప్పు తీర్చేసేవాణ్ని. నాకు రెండు మాసాలు టైమిస్తే బకాయి పడ్డ సొమ్ము కట్టేస్తా సార్" అన్నాడు రెండు చేతులూ కట్టుకుని.

"నీ భార్య చనిపోయిన షాక్ నుండి కోలుకున్నావా అప్పన్నా" సానునయంగా అడిగాను.

"పోయిన మనిషి తిరిగి రాదు కద్సార్, ఇప్పుడు నా యావంతా పిల్లల కోసమే. దానికి పిల్లలంటే ఎంత ప్రేమో. తన మీదకి చావు వస్తున్నా భయపడలేదు. పిల్లలకి దూరమైపోతున్నాననే బెంగపడేది" కంట నీరు కారుతుండగా గద్గద స్వరంతో చెప్పాడు అప్పన్న.


"భార్య చనిపోయిన బాధతో నువ్వు రోజూ నాటు సారా త్రాగేవాడివని నీ పాత ఇంటి దగ్గర అమ్మలక్కలు చెప్పారు. ఇప్పటికీ తాగుతున్నావా అప్పన్నా" ఆందోళనగా అడిగాను.

"ఇప్పుడు తాగడం లేదు సార్. నా భార్య చనిపోయినప్పుడే నా లోకం తల్లకిందులైపోయింది. తను చనిపోయింది అంటే నేను చనిపోయాననే అనుకున్నా. చనిపోయానన్న భ్రాంతి ఎంతగా ఆవరించిందంటే ఓ వారం రోజుల పాటు తిండీ తిప్పలు లేకుండా తాగుతూనే గడిపాను. కాలమే గాయాలను మాన్పుతుంది అంటారుకదా. తను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించే పిల్లల కోసం మళ్లీ కష్టపడుతున్నాను. రోజులో ఓపికున్నంతసేపు ఆటో వేస్తాను. అలిసిపోయి ఇక పనిచేయలేననుకున్నపుడే ఇంటికెళ్తాను. చిన్నపుడే అమ్మా అయ్యల్ని కోల్పోయినవాణ్ని. ఆ ప్రేమ విలువేంటో తెలుసు. నా పిల్లలకి తల్లిలేని లోటు లేకుండా పెంచి, బాగా చదివించి ప్రయోజకుల్ని చేయగలిగితే ఈ చిన్న ప్రాణానికి అదే పదివేలు సార్. మీ అప్పు సంగతీ మర్చిపోను సార్, రెండు నెలల్లో బకాయి పడ్డది తీర్చేసి తరువాత నుండి ఏ నెలది ఆ నెలే తీర్చేస్తాను."

ఓ కొవ్వొత్తిలా కరిగిపోతూ తన కుటుంబాన్ని నిలబెట్టటానికి అతను పడుతున్న తపన, ఆర్తి నన్ను కదిలించాయి. జీవితమంతా పరుగేనని, శ్రమేనని, సుఖం లేదని తెలిసీ మడమ తిప్పని యోధుడిలా ముందుకెళ్లే అతడి ధోరణి నన్ను కదిలించింది. ఇన్ని కష్టనష్టాలు ఎదుర్కొంటూ కూడా నిజాయితీగా రుణం వాయిదాల్ని కట్టడానికి ముందుకొస్తున్న అతడి మనోధైర్యానికి మనసులోనే హేట్సాఫ్ చెప్పాను.

* * *

ఇంటికి వచ్చానన్న మాటేగానీ అప్పన్న మాటలే వెంటాడుతున్నాయి. అతనికి భార్య పట్ల, పిల్లల పట్ల ఉన్న అనన్యమైన ప్రేమ నాలో ఉన్న డొల్లతనాన్ని ప్రశ్నిస్తోంది. డబ్బు మీద, కెరీర్ మీద నాకున్న యావని ఎత్తి చూపిస్తోంది. యాంత్రిక జీవనం నన్ను ఈడ్చుకెళ్తున్నా ఓర్పుగా దాని వెంటే వెళ్తున్న నా చేతకానితనాన్ని బయటపెట్టింది.




## డాన్‌గా సంగీత

ఇంతకాలం గ్లామరస్ హీరోయిన్‌గా, కాస్త నెగటివ్ షేడ్లున్న హీరోయిన్‌గా కూడా నటించిన సంగీత తాజా 'తంబి కొట్టై' అనే తమిళ చిత్రంలో 'లేడీ డాన్'గా నటిస్తూ వార్తల్లోకి వచ్చింది. ప్రభు-మీనా-పూనమ్ బజ్వా నటిస్తున్న ఈ సినిమాలో తను ధరిస్తున్న పాత్ర తనకి మంచి పాపులారిటీ తెస్తుందన్న ఆశతో వుందిట సంగీత. ఇలాంటి పాత్రలు వేయడానికి హీరోయిన్‌లు అంతగా ముందుకు రారు, కానీ నేను ఆ చాన్స్ వదులుకోదల్చుకోలేదు. నా నటన తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది- అనే ధీమా వ్యక్తం చేస్తోంది సంగీత.

జీవితాన్ని ఎందుకోసం జీవించాలన్న నిలువెత్తు ప్రశ్నని అప్పన్న జీవితం నా ముందు నిలబెట్టిందనిపించింది.

నా తల్లిదండ్రులు ఎక్కడో మారు మూల పల్లెలో ఒక్కగానొక్క కొడుకునైన నాపై ఆశలు పెట్టుకుని బ్రతుకుతున్నారు. నేను, నా భార్య వేరువేరుగా ఒంటరిగా జీవిస్తున్నాం. నా జీవితంలోకి అనుబంధాల్ని, ఆప్యాయతల్ని ఆహ్వానించాలని దృఢంగా నిర్ణయించుకున్నాను. అవి రావాలంటే నా తల్లిదండ్రులు, నా భార్య నా దగ్గరకి రావాలి.




* * *

గోదావరి ఎక్స్‌ప్రెస్ కోసం అసహనంగా ఎదురుచూస్తున్న నాకు, గంట లేటుగా వస్తుందన్న ఎనౌన్స్‌మెంటు విని చిర్రెత్తుకొచ్చింది. ఎప్పుడు నా శ్రీమతి వైజాగ్ వచ్చినా రిసీవ్ చేసుకోవడానికి వెళ్లని నాకు, స్టేషన్‌కి వచ్చిన రోజు ట్రైన్ ఆలస్యం అవ్వడం ఇబ్బందికరమయితే, నేను తెచ్చిన గులాబీ పూలని నా శ్రీమతికి ఎప్పుడెప్పుడు ఇద్దామా అన్న నా ఆత్రం నా అసహనాన్ని మరింత పెంచుతోంది.

ఎట్టకేలకు గోదావరి ఎక్స్‌ప్రెస్ రావడం, నా శ్రీమతి నన్ను చూసి ఆశ్చర్యపోయింది. నేను తెచ్చిన గులాబీలని చూసి నమ్మలేనట్లుగా నా కళ్లలోకి చూసింది. నేను ఆమె కళ్లలోకి చూశాను. ఆమె కళ్ల కింద నల్లటి చారలు, ఆమె ఎదుర్కొంటున్న పనిభారాన్ని, మానసిక ఒత్తిడిని, ఒంటరితనాన్ని సూచిస్తున్నాయి.

ఇంటికెళ్లిన తరువాత నేనే కాఫీ కలిపి ఇచ్చి, స్నానానికి వేన్నీళ్లు పెట్టాను. తను స్నానం కానిచ్చి, పూజ చేసిన తరువాత నా మనసులో సంఘర్షిస్తున్న భావాలను చెప్పాను. సంఘర్షణకు కారణమైన అప్పన్న గురించీ చెప్పాను. తను చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి వైజాగ్ వచ్చేయమని అర్థించాను. ఉద్యోగం చెయ్యాలనుకుంటే జీతం తక్కువైనా ఇక్కడే ఏదో ఒకటి చూసుకోమన్నాను. అంతకుమించి బలంగా మన అనుబంధానికి ప్రతీకగా బాబునో పాపనో కందామని ప్రపోజ్ చేశాను. అమ్మానాన్నల్ని పల్లెటూర్లో మిగిలిన ఆస్తుల్ని అమ్మేసి నా దగ్గరికి శాశ్వతంగా వచ్చేయమని చెబుదామనుకుంటున్నానని చెప్పాను. ఇవన్నీ నాలుగేళ్ల కిందటే చేయాల్సినవని, ఇప్పటికే వెనుకబడ్డానని, ఇప్పటికైనా ప్రారంభించకపోతే మరెప్పటికీ ప్రారంభించలేనన్న భయం వెంటాడుతోందనీ చెప్పాను. నా ఊహలకే పరిమితమైపోయిన నవ వసంతాన్ని చేరుకోవడానికి అడుగుల్ని ఇప్పుడే ఈ క్షణం నుండే వేయాలనుకుంటున్నానని చెప్పాను. తనకి అభ్యంతరం లేకపోతే అప్పన్న ముగ్గురి పిల్లల్లో ఒకరిని చదివిస్తానని చెప్పాను.

మనసులో ఎన్నో అనుకున్నాను కానీ, అన్నీ సరిగా చెప్పలేకపోయాననిపించింది. అయినా చెప్పాల్సినవి ఏదోవిధంగా బయటకి కక్కగలిగానన్న సంతృప్తి కలిగింది. మనసులో భారం తగ్గి గాల్లో తేలుతున్నట్లుగా అనిపించింది. సోఫాలో కూర్చున్నవాడిని అలాగే తల వెనక్కు వాల్చి కళ్లు మూసుకున్నాను. కళ్లు తెరిచేసరికి, నా శ్రీమతి నా గుండెల మీద తలపెట్టి నా పక్కనే కూర్చుంది. ఆమె కళ్ల నుండి జాలువారుతున్న కన్నీళ్లు నా గుండెని తడిపి ముద్దచేస్తున్నాయి. ఆమెని మరింతగా నాలోకి పొదువుకున్నాను.



## కొత్త జెనీలియా

ఈమధ్య హిందీలో బిజీ అయ్యాక తెలుగులో జెనీలియా సినిమాలు తగ్గాయని చెప్పవచ్చు. ఆమె నటించిన తాజా చిత్రం 'కథ' ఆశించినంత విజయం సాధించకపోవడం ఇందుకు మరో కారణం కూడా కావచ్చు. అయితే జెనీలియా ఇప్పుడు కొత్తగా ఓ సినిమాని అంగీకరించిందిట. తొలిసారిగా ఆమె మహేష్ బాబుకి జంటగా నటిస్తోంది. తనదైన స్టయిల్ కామెడీతో చిత్రాల్ని రూపొందించే శ్రీను వైట్ల దర్శకత్వంలో తయారయ్యే ఈ చిత్రం జెనీలియా కెరీర్‌కి మంచి మలుపు అవుతుంది.